సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



లారీ, బైక్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

మంగంపేట జాతీయ రహదారిపై లారీ బైక్ ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. మరొకరి పరిథి విషమంగా ఉంది. -8లో..



లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని కడప శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 466 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	530	540
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 154.800 కిలోలు

న్యూస్‌రీల్

సదరం శిబిరానికి 315 మంది హాజరు

మదనపల్లె సిటీ: మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో శనివారం జరిగిన సదరం కార్యక్రమానికి 315 మంది హాజరయ్యారు. ఆర్థో, ఈఎన్‌టీ, ఆప్తమాలిక్, సైకియాట్రిక్ కేసులను ఆయా విభాగాధిపతులు పరీక్షించారు. శిబిరానికి హాజరయ్యేవారికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు.

ఏకగ్రీవ ఎన్నిక



పగడాల ప్రీతి

రామసముద్రం: రాష్ట్ర గ్రామ సచివాలయం జాయింట్ సెక్రటరీగా రామసముద్రం మండలం కేంద్రంలోని సచివాలయంలో-1లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పగడాల ప్రీతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులకు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాకు ఈ అవకాశం కల్పించిన సహోద్యోగులకు కతజ్ఞతలు తెలియజేశారు.

వీరజవాన్ భార్యకు ఉద్యోగం



బి.శ్యామల

తంబళ్లపల్లె: వీరజవాన్ లాన్స్‌నాయక్ సాయితేజ భార్య శ్యామలకు ప్రభుత్వ ఉద్యోగం దక్కింది. ఆమె స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టి శనివారం విధులకు హాజరయ్యారు. కురబలకోట మండలం రేగడకు చెందిన సాయితేజ దేశభద్రతాధికారి మేజర్ బిపిన్‌రావత్‌తో విధి నిర్వహణలో గతంలో హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తనకు ఉద్యోగం రావడానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలకు శ్యామల కృతజ్ఞతలు తెలిపారు.

'పర్యాటక' పోటీలు

వైవీయూ: అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవం-2023 పురస్కరించుకుని వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ అధ్యాపకులు మనోజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీన క్విజ్, యంగ్ మేనేజర్ పోటీలు.. 27న స్పాట్ గేమ్స్, స్పాట్ ఫొటోగ్రఫీ, పోస్టర్ మేకింగ్, ట్రెజర్ హంటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 6300825957, 81296 07524 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నూతన కార్యవర్గం



ఇరిగేషన్ ఎన్జీఓ అసోసియేషన్ కార్యవర్గం

కడప కోటిరెడ్డిసర్కిల్/రూరల్ : ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా సర్కిల్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కడప నగరంలోని ఎన్జీఓ హోంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఎన్జీఓల సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిగా బి.శ్రీనివాసులు, కడప ఇరిగేషన్ సర్కిల్ అధ్యక్షుడిగా పి.సలేశ్వర్‌రెడ్డి, కార్యదర్శిగా ఎస్.సుబ్బరాయుడు, టీజీపీ సర్కిల్ అధ్యక్షుడిగా టీవీ సుధాకర్, కార్యదర్శిగా బి.శ్రీనివాసులురెడ్డి, జీఎన్ఎస్ఎస్ సర్కిల్ అధ్యక్షుడిగా జి.సుబ్రమణ్యం, కార్యదర్శిగా వై.శివయ్య, సీసీ సర్కిల్ అధ్యక్షుడిగా ఎం.జయరామిరెడ్డి, కార్యదర్శిగా పి.శ్రీనివాసులురెడ్డిలను ఎన్నుకున్నారు. పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి రవికుమార్, సంయుక్త కార్యదర్శి పోలిరెడ్డిలు వ్యవహరించారు.

పుత్తడి బొమ్మకు పుస్తెల బంధనం

బడిలో బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన పుత్తడిబొమ్మలకు మూడుముళ్ల బంధనాలు వేసి వారి భవితను చిదిమేస్తున్నారు. తల్లిదండ్రుల అవగాహనలోపం, నిరక్షరాస్యత బాల్య వివాహాలకు కారణాలవుతున్నాయి.బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను వారికి వివరించి పుస్తెల భారం వేయకుండా పుస్తకాలతో చెలిమి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- ఆడపిల్ల భారం కాదు..ఆణిముత్యం
- బాల్య వివాహాల నిషేధ చట్టం అమలుకు చర్యలు
- హెల్ప్‌లైన్ కేంద్రాల ఏర్పాటు



కడప సెవెన్‌రోడ్స్: 'పెళ్లంటే నూరేళ్లపంట. పరిణితి చెందిన వయస్సులో జరిగితేనే.. ఆ కాపురం కలతలు, కష్టాలు లేని కుటుంబం అవుతుంది. అభం శుభం తెలియని వయస్సులో చేస్తున్న బాల్యవివాహాలు బాలికల బంగారు భవిష్యత్తుకు అవరోధాలుగా మారుతున్నాయి. వీటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'బాల్య వివాహ నిషేధ చట్టం - 2006'పటిష్ట అమలుకు చర్యలు తీసుకుంటోంది. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, వివిధ శాఖల భాగస్వామ్యంతో అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు.

- ఆడపిల్ల పుట్టిందంటే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంబరపడతారు. కానీ, బాలికలకు సరైన వయస్సు రాకముందే పెళ్లిచేసి తమ భారం దించుకునేందుకు కొందరు తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తున్నారు. చదువుకునే వయస్సులోనే వివాహ బంధం పేరుతో బంధనం వేస్తున్నారు. ఆలోచించకుండా, ఉన్నత చదువులు చదివించకుండా, ఉద్యోగాలు చేయనీయకుండా 18 ఏళ్లు నిండకుండానే పెళ్లిచేసి చిన్నారుల జీవితాలతో ఆడుకుంటున్నారు.
- బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఎవరి దృష్టికైనా వస్తే హెల్ప్ లైన్ నంబర్ల ద్వారా వెంటనే సమాచారాన్ని అందుకునే నెట్ వర్క్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఇలా సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి వివాహాలను అడ్డుకుంటున్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 నిండిన తర్వాతే..వివాహం చేయాలి. బాల్య వివాహం చేసినా.. చేసుకున్నా.. ప్రోత్సహించినా రెండేళ్లు జైలు శిక్ష లేదా రూ.1 లక్ష జరిమానా విధిస్తారు. దీనిపై తల్లిదండ్రులు, విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలి

బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాల గురించి ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించినా మార్పు అనేది ముందుగా కుటుంబ వ్యవస్థలో రావాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు, విద్యాలయాల్లో బాలబాలికలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు ఉన్న బాలబాలికలను గురుగుల పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించేలా.. ప్రోత్సహించి వారి ఉన్నత విద్యకు తోడ్పడుతున్నారు. బాలికా విద్యను ప్రోత్సహిస్తే.. కుటుంబం మొత్తం విద్యావంతులై వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునే అవకాశం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రచారం చేస్తోంది.

ఇవీ అనర్థాలు

బాల్య వివాహాల వల్ల ఎన్నో రకాల అనర్థాలు జరుగుతున్నాయి. బాలికలు రక్తహీనతకు గురికావడం, అనారోగ్యకర శిశువులకు జన్మనివ్వడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. సరైన అవగాహన లేక కలహాలు ఏర్పడి విడాకులు తీసుకునే వరకు పరిస్థితులు వెళుతున్నాయి. యుక్త వయస్సుకు రాకముందే వివాహం చేయడం వల్ల నిరక్షరాస్యత పెరుగుతోంది. బాలికల మానసిక పరిస్థితి గందరగోళంగా మారుతోంది. గృహ హింసకు గురవుతున్నారు. ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయి. వయోజన తల్లులతో పోలిస్తే 18 ఏళ్ల వయసులోపు తల్లులకు పుట్టే బిడ్డల్లో 75 శాతం శిశుమరణాలు ఎక్కువ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఒక్క ఫోన్ కాల్‌తో సేఫ్..!!

ఆపదలో ఉన్న బాలల తక్షణ సహాయం కొరకు ఈ క్రింది పొందుపరిచిన హెల్ప్ లైన్ నెంబర్ల ద్వారా సమాచారం అందించవచ్చని.. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కరపత్రాలు, గోడ పత్రాలు ద్వారా విస్తత ప్రచారం, ప్రజల్లో అవగాహన పెంచుతోంది.

- చైల్డ్ హెల్ప్ లైన్: 1098
- ఏపీ పోలీస్ హెల్ప్ లైన్: 100
- ఉమెన్ హెల్ప్ లైన్: 181
- సాధారణ హెల్ప్ లైన్: 112

జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీఓలు, సీడీపీఓలు, మండలస్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ వార్డు స్థాయి అధికారులతో బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబరు. 31, 39ల అమలుపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరిగే హాట్ స్పాట్ ప్రాంతాలను గుర్తించాలని, గోడల మీద ప్రజలకు అర్థమయ్యే విధంగా పెయింటింగ్‌లను ఏర్పాటు చేసి బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు గురించి అవగాహన కల్పించాలని డివిజినల్ స్థాయిలో ఆర్డీఓలకు, మండలస్థాయిలో తహసీల్దార్లకు సూచించారు. 15 నుంచి 18 సంవత్సరాలు వయస్సుగల ఆడపిల్లలు, అబ్బాయిలను పాఠశాల లేదా కళాశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐసీడీఎస్ జిల్లా అధికారి ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సీపెట్ ద్వారా ఉపాధి

కడప ఎడ్యుకేషన్: విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) ద్వారా ఓబీసీ, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అందిస్తున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతకు పాలిమర్స్ టెక్నాలజీ నందు మెషీన్ ఆపరేటర్(ప్లాస్టిక్ ప్రాసెసింగ్) మరియు మెషీన్ ఆపరేటర్ అసిస్టెంట్(ప్లాస్టిక్ ప్రాసెసింగ్) కోర్సులలో 3 నుంచి 6 నెలల పాటు శిక్షణను ఇవ్వనున్నారు. అనంతరం వివిధ సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నామన్నారు. శిక్షణాకాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలను అందిస్తామని.. అభ్యర్థులు తమ విద్యార్హత, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డులతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో 6300147965 నంబరులో సంప్రదించాలన్నారు.

నిత్యాన్నదానానికి భూరివిరాళం



దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ ముకుందారెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రూ.1,00,116లు విరాళంగా అందాయి. గడ్డంవారిపల్లె గ్రామం తొట్టికాడపల్లెకు చెందిన వసంతు రామకృష్ణారెడ్డి, ఆయన సతీమణి రాధిక తమ కుటుంబ సభ్యులు సీపీ పుల్లారెడ్డితో కలిసి ఈ నగదును ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామికి ప్రత్యేక పూజలు చేయించి శేషవస్త్రం , స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కుందూనదిలో వరద నీటి ఉద్ధృతి

కుందూనదిలో జలకళ

వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలోని కుందూనదిలో శనివారం సాయంత్రం నీటి మట్టం పెరిగింది. కర్నూలు జిల్లాలో శుక్ర, శనివారాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద నీరు కుందూనదిలో చేరటంతో నీటిప్రవాహం పెరుగుతోంది. కుందూనదిలో 8 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోన్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు.

-చాపాడు

ప్రియుడితో వచ్చి విగతజీవిగా..

అడవిలో యువతి అనుమానాస్పద స్థితిలో మృతి



హర్షిత మృతదేహం



హేమంత్

కోలారు(కర్ణాటక) : అటవీ ప్రాంతానికి వచ్చిన ప్రేమజంటలో యువతి అనుమానాస్పద స్థితిలో శవమై తేలింది. ఈ సంఘటన కర్ణాటకలోని కోలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకా రాయల్పాడు పీఎస్ పరిధిలోని సణ్ణకల్లు అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన హర్షిత (20), ఆమె బంధువు, అలాగే ప్రియుడు అయిన హేమంత్ ప్రేమించుకుంటున్నారు. ఇరువురి తండ్రులు పీలేరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగులని తెలిసింది. హర్షిత మదనపల్లెలో హాస్టల్‌లో ఉంటూ బీఎస్సీ (అగ్రికల్చర్) రెండవ సంవత్సరం చదువుతోంది. ఇద్దరూ కలిసి సణ్ణకల్లుకు శుక్రవారం సాయంత్రం వచ్చారు. అక్కడ వారిద్దరి మధ్య గొడవ జరగడంతో హేమంత్ ఒక్కడే వెళ్లిపోయాడు. కొంతసేపటికి తాను తిరిగి వచ్చి చూడగా.. హర్షిత చెట్టుకు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకుందని అతడు చెబుతున్నాడు. ఈ విషయం తెలిసి హర్షిత కుటుంబ సభ్యులు వచ్చి బోరున విలపించారు. రాయల్పాడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి హేమంత్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

గ్రామీణులకు ఆరోగ్య భరోసా

- అన్ని పీహెచ్‌సీల్లో నిరంతర సేవలు
- ఫ్యామిలీ ఫిజీషియన్ విజయవంతం



మదనపల్లె మండలం బొమ్మనచెరువు పీహెచ్‌సీ

మదనపల్లె సిటీ: ఇంట్లో కోట్లు మూలుగుతున్నా ఒంట్లో రోగాలుంటే నిష్ప్రయోజనమే. అందుకే 'ఆరోగ్యమే మహా భాగ్యం' అన్నారు పెద్దలు. ఆనాడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో వైద్యరంగానికి ఊపిరిపోస్తే.. నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మరో అడుగు ముందుకేసి వైద్యరంగానికి మరింత ఊతమిస్తున్నారు. పల్లెల్లో ప్రతి గడపకు వైద్యమందేలా గ్రామీణులకు ఆరోగ్య భరోసా ఇస్తున్నారు. వైద్యులే పల్లెల్లో రోగి ఇంటికి వెళ్లి సేవందించేలా చర్యలు తీసుకుంటూనే ...మరో వైపు పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు నిరంతరం సేవలందించేలా సిబ్బందిని నియమించి ఉపశమనం కల్పించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ప్రభుత్వ నిర్ణయంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇకపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీలు) 24 గంటలూ వైద్య సేవలు అందిస్తాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 49 పీహెచ్‌సీలున్నాయి. వీటిల్లో సెప్టెంబర్ 1 నుంచి నిరంతరం రోగులకు సేవలు అందుతున్నాయి.

దిగ్విజయంగా ఫ్యామిలీ ఫిజీషియన్

ఇప్పటికే ప్రభుత్వం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తోంది. ఇంటింటికి వైద్య సేవలు అందిస్తోంది. దీని కోసం ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండేలా నియామకాలు చేశారు. ఒక వైద్యుడు వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యం అందిస్తే, మరో వైద్యుడు 104 వాహనం ద్వారా గ్రామాల్లో ఏర్పాటైన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌కు వెళ్లి ఉదయం నుంచి ఓపీ చూడటం, మధ్యాహ్నం నుంచి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి, దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి సేవలందిస్తున్నారు. పాఠశాలల, అంగన్‌వాడీ చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పీహెచ్‌సీల్లో 24 గంటలూ సేవలు

సెప్టెంబర్ ఒకటి నుంచి పీహెచ్‌సీల్లో 24 గంటలూ సేవలందించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొన్ని పీహెచ్‌సీల్లో సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండగా, కొన్నింటిలో అరకొరగా ఉన్నారు. దీంతో ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది తప్పనిసరిగా ఉండేలా ప్రభుత్వం సర్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియను పూర్తి చేసి సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి నిరంతర వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఎంపిక చేసిన కొన్ని పీహెచ్‌సీలు మాత్రమే 24 గంటలూ పని చేసేవి. ఈ విధానం ద్వారా సేవలు అన్ని పీహెచ్‌సీలకూ వర్తిస్తాయి. తలుపు తడితే వైద్యం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

సిబ్బంది విధులు ఇలా...

పీహెచ్‌సీకి కేటాయించిన ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఆస్పత్రిలో ఉంటే మరొకరు పల్లెలోని హెల్త్‌క్లినిక్‌లకు 104 వాహనంలో వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ వైద్యుడు లేదా వైద్యురాలు మధ్యాహ్నం నుంచి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఫాలోఅప్, పాఠశాల, అంగన్‌వాడీ బాలలకు వైద్య సేవలు అందిస్తున్నారు. స్టాఫ్‌నర్సులు ముగ్గురు ఉంటారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉద యం 8 వరకు వీరు మూడు షిఫ్ట్‌ల్లో పని చేస్తారు. అత్యవసర కేసులు వస్తే కాల్ డ్యూటీ మీద రోగులకు వైద్య సేవలందించేందుకు వైద్యులు రావాల్సి ఉంది.

పీహెచ్‌సీల్లో సిబ్బంది వివరాలు ఇలా..

- వైద్యులు : 2
- స్టాఫ్ నర్సులు : 3
- ఫార్మసిస్టు : 1
- ల్యాబ్‌టెక్నీషియన్ : 1
- ఎంఎన్‌ఓ లేదా ఎఫ్ఎన్ఓ : 1
- మేల్,ఫిమేల్ అసిస్టెంట్లు : 1
- ఎంపిహెచ్ఎస్ మేల్ : 1
- జూనియర్ అసిస్టెంట్ : 1
- ఎంపీహెచ్ఎస్ ఫిమేల్ : 1
- సీహెచ్ఓ : 1
- హెల్త్ ఎడ్యుకేటర్ : 1



24 గంటలూ వైద్యసేవలు



జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలూ సేవలందిస్తున్నాయి. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. దీంతో పాటు సిబ్బంది పని చేస్తున్నారు. వైద్యం అందరికి అందుతుంది.

-డాక్టర్ లోకవర్ధన్, జిల్లా ప్రోగ్రాం అధికారి

పాతకక్షలతో అన్నాచెల్లెళ్లపై దాడి

మదనపల్లె : పాతకక్షలతో అన్నాచెల్లెలుపై ప్రత్యర్థులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సీటీఎం యానాదులకాలనీకి చెందిన అన్నాచెల్లెలు శ్రీనివాసులు(45), చంద్రకళ(35)లతో అదే కాలనీకి చెందిన కొందరు కొంత కాలంగా ఇంటి స్థలం విషయమై గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో వినాయకచవితి చందాల విషయమై గొడవ జరగడంతో శ్రీనివాసులు, చంద్రకళపై సాయి, గంగాధరరావు, రంగనాథం, నవీన్, సాయిలు కర్రలతో దాడికి పాల్పడ్డారు. దాడిలో అన్నాచెల్లెలు గాయపడటంతో స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. మదనపల్లె రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద స్థలం పరిశీలన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ, రూరల్ సీఐ

సంబేపల్లె : మండలంలోని దేవపట్ల వద్ద చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై గురువారం రాత్రి లారీ, టూరిస్ట్ బస్సు ఢీకొన్న ప్రమాద స్థలాన్ని ఎంవీఐ అనీల్‌కుమార్, రూరల్ సీఐ తులసీరామ్ శనివారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై వారు ఆరా తీశారు. ప్రమాదానికి గురైన బస్సు, లారీని జాతీయ రహదారిపై తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. జాతీయ రహదారిపై పలు ప్రమాద స్థలాలను గుర్తించి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. వీరి వెంట సంబేపల్లె ఎస్‌ఐ షరీఫ్ ఉన్నారు.

లారీ, బైక్ ఢీకొని ఇద్దరు దుర్మరణం

ఒకరి పరిస్థితి విషమం



మృతి చెందిన హుస్సేన్ బాషా



ముత్తుస్వామి మృతదేహం



తీవ్రంగా గాయపడ్డ నరేంద్ర



బోల్తా పడిన ఖాళీ ఆయిల్ ట్యాంకర్



ప్రమాదానికి గురైన బైక్

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం లారీ, బైక్ ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు నుంచి కర్ణాటకకు వెళ్తున్న ఖాళీ ఆయిల్ ట్యాంకర్ లారీ మంగంపేట జాతీయ రహదారిపై గుట్ట దిగువ వైపు వేగంగా వస్తుండటంతో.. రైల్వేకోడూరు వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్ ముత్తుస్వామి(40) క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెళ్తున్న హుస్సేన్ బాషా(35) కాలు విరిగిపోయి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వ్యక్తి నరేంద్ర పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. హుస్సేన్ బాషా కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన వాడు. గత కొన్ని నెలలుగా రైల్వేకోడూరులోని సమతానగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగంపేట పరిసర ప్రాంతాలలో సెంట్రింగ్ పనులు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ లాగే శనివారం సాయంత్రం పనులు పూర్తి చేసుకొని స్నేహితుడు నరేంద్రతో కలిసి రైల్వేకోడూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మంగంపేట జాతీయ రహదారిపై గుట్ట ఎక్కుతుండగా లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. లారీ బోల్తా కొట్టి పక్కకు పడిపోవడంతో ముత్తుస్వామి క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి మృతి చెందగా.. ఆయన మృతదేహాన్ని క్రేన్ సాయంతో బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఇరు వర్గాల మధ్య గొడవ

సిద్దవటం : నేకనాపురం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శనివారం ఇరు వర్గాల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఇరు వర్గాల వారు రోడ్లపై బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న సిద్దవటం పోలీసులతోపాటు కడప డీఎస్పీ షరీఫ్, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌ఐ మధుసూదన్‌రావు, చిన్నచౌకు ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ అక్కడికి చేరుకున్నారు. ఇరు వర్గాల వారితో చర్చించి సమస్యను పరిష్కరించారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శివప్రసాద్(57)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివప్రసాద్‌కు కొంత కాలం క్రితం కంటికి శుక్లం రావడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంతరం కంటి చుట్టూ అలర్జీ రావడంతో బెంగళూరు, హైదరాబాద్ తదితర ఆస్పత్రులలో చూపించారు. అయినా అలర్జీ తగ్గకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో శనివారం ఉదయం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



బైక్‌ను ఢీకొన్న టిప్పర్



గాయపడ్డ నాగార్జున

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. మదనపల్లె పట్టణంలో శనివారం బైకును టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన నాగార్జున, చక్రపాణి బెంగళూరు బస్టాండ్‌లో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా.. మార్గమధ్యంలో కదిరి రోడ్డులో ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నాగార్జున పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సల కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని..

మదనపల్లె సిటీ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన సంఘటన శనివారం రాత్రి కురబలకోట మండలం అంగళ్లు వద్ద జరిగింది. మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన సురేంద్ర (38) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా ప్రమాదవశాత్తు అంగళ్లు వద్ద డివైడర్‌కు ఢీకొన్నాడు. దీంతో సురేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కడప అగ్రికల్చర్ : రైతు శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, అందుకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉమ్మడి జిల్లాలైన వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల ఏడీఏలకు రైతు భరోసా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతుల పంట సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంతోపాటు అన్ని రకాలుగా తోడుగా ఉంటోందన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసచారి, కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో తక్కువ వర్షపాతం ఉన్నందువల్ల ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పెసర తదితరాలను సాగు చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై శనగ, వేరుశనగ, మినుము, పెసలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయలక్ష్మి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల ఏడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫెడల్ ఫర్ ఫ్రీడమ్ గ్రూపు సభ్యులు, సీఐ, అధ్యాపకులు

మదనపల్లె సిటీ : 'మౌనాన్ని వీడుదాం.. మార్పు తీసుకువద్దాం..' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాల్లో సైకిల్ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు రెడ్‌రోప్ సంస్థ ప్రతినిధి క్రిసలైట్ సనమండా అన్నారు. శనివారం ఫెడల్ ఫర్ ఫ్రీడమ్–23 గ్రూపు సభ్యులు మదనపల్లెకు చేరుకున్నారు. వీరికి మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా స్వాగతం పలికారు. స్థానిక మహిళా డిగ్రీ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిసలైట్ సనమండా మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులకు ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్ననట్లు తెలిపారు. ఈ నెల 20న గుంటూరులో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రెడ్‌రోప్ మూమెంట్ పేరిట వివిధ కాలేజీలకు చెందిన 15 మంది విద్యార్థుల బృందంతో 700 కిలోమీటర్లు సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో స్థానిక ఎన్జీవోల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నుంచి చీరాల, ఒంగోలు, నెల్లూరు, మదనపల్లె మీదుగా రామచోటి, కడప, అనంతపురానికి చేరుకుంటుందన్నారు. కాలేజీ సర్వీస్ కమిషనర్, ఏపీ శాక్స్, రెడ్ రోప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా అందరికీ న్యాయం, వ్యభిచార కూపం నుంచి విముక్తి, లైంగిక వేధింపులు, వయోజన విద్య గురించి వివరించడం జరుగుతుందన్నారు. మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలు, లైంగిక వేధింపులపై అవగాహన కలిగి వుండాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ బీటీ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాలపై రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ నిర్వాహకురాలు సుభద్ర, అధ్యాపకులు మోహన్‌వల్లి, జ్యోతి, విష్ణుప్రియ, ఖాజావల్లి, మోహన్‌బాబు, గురుమూర్తి, సుబ్బరాయుడు, భవానీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నందలూరు (రాజంపేట) : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ నడిగడ్డ గ్రామ సమీపంలోని చెయ్యేరులో కనపర్తి జయమ్మ(40) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనపై ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ శనివారం వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా ముద్దిగుబ్బ టీచర్స్ కాలనీకి చెందిన కనపర్తి జయమ్మ పెనగలూరు మండలం నల్లపరెడ్డిపల్లెకు చెందిన చెల్లెలు ఇంటికి వచ్చింది. తిరిగి పెనగలూరు నుంచి కడపకు వెళ్తూ నందలూరులో దిగింది. అనంతరం నల్లతిమ్మయ్యగారిపల్లి పంచాయతీ నడిగడ్డ గ్రామం చెయ్యేరులో మృతి చెందింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు. చెయ్యేరులో వాకింగ్ చేస్తున్న ప్రజలు.. మృతదేహాన్ని చూసి స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రామాపురం : మండల పరిధి జాతీయ రహదారిలోని చిట్లూరు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులో వాహనం బోల్తా కొట్టిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు నుంచి రాయచోటి వైపు ఇంటి సామాన్లు షిఫ్ట్ చేసే క్రమంలో మినీ లారీ వస్తుండగా మార్గంమధ్యలో డ్రైవర్ నిద్రమత్తులో బోల్తా కొట్టింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

గోదాముపై విజిలెన్స్ దాడులు

– 722 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధి చెన్నంపల్లె బీసీ కాలనీ సమీపంలోని ఓ గోడౌన్‌పై శనివారం కడప విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 722 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ ఈదురుబాషా తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు పౌర సరఫరా సంస్థ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. 722 బస్తాలతో కూడిన సుమారు 35220 కేజీల రేషన్ బియ్యంతోపాటు లారీని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన సునీల్, రవాణాకు సహకరించిన ప్రసాద్‌లను అర్బన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనం విలువ సుమారు రూ.24,26,410 ఉంటుంది. ఈ దాడుల్లో విజిలెన్స్ అసిస్టెంట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుళ్లు జనార్ధన్‌రావు, కృష్ణానాయక్, హరినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

అట్లూరు : వినాయక విగ్రహాల తరలింపు విషయమై దాడి చేసుకున్న ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సి.రాజు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి అట్లూరు క్రాస్ రోడ్డులోని ఉప్పుటూరు, మద్దూరు కాలనీలలో వేర్వేరుగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో రెండు కాలనీల వాసుల మధ్య మాటకుమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాల వారు రాళ్లు, కట్టెలతో దాడి చేసుకున్నారు. పలువురు గాయాల పాలయ్యారు. బాధితులను కడప రిమ్స్‌కు తరలించారు. ఉప్పుటూరు కాలనీకి చెందిన నరసింహులుతోపాటు మరో 13 మందిపై, మద్దూరు కాలనీకి చెందిన సుబ్బరాయుడుతోపాటు మరో 13 మందిపై కేసు నమోదు చేశారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా.. రెండు కాలనీలలో సిబ్బందితో కలసి గస్తీ తిరుగుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సంబరాల్లో భాగంగా శనివారం కడపలో యూటీఎఫ్ నాయకులు ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సర్కిల్ నుంచి వై జంక్షన్, ఎర్రముక్కపల్లె మీదుగా యూటీఎఫ్ భవన్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. యూటీఎఫ్ భవన్ వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ 'విద్యా రంగాన్ని కాపాడుకుందాం.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుందాం' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు టీంల ఆధ్వర్యంలో ప్రచార జాతా కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు, నాయకులు రవికిరణ్, నరసింహారావు, ప్రభాకర్, సీవీ రమణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ ఎం.ప్రదీప్‌కుమార్ తెలియజేశారు. కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడిన వారు శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. విద్యార్థుల మధ్య ఏ రూపంలో ర్యాగింగ్ జరిగినా నేరని చెప్పారు. ర్యాగింగ్ నిషేధంపై విద్యా సంస్థల్లో అవగాహన పెంచాలని తెలిపారు. ర్యాగింగ్ వల్ల సంభవించే దుష్పరిణామాలు, పాల్పడిన వారికి విధించే శిక్షలను వివరించారు. ర్యాగింగ్ జరిగితే టోల్‌ఫ్రీ నంబర్లు: 100, 108, 1098, 14567, సెక్షన్ 125 సీఆర్‌పీసీ, ఉచిత న్యాయసహాయం గురించి తెలియజేశారు. ఈ సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, సైక్రియాట్రీ ఇన్‌చార్జి హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటరాముడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు, వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్

వైవీయూ : లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని కడప శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో లోక్ అదాలత్ న్యాయసేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు వర్గాలు రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా 10 రకాలైన ప్రజా ప్రయోజితసేవా రంగాలకు సంబంధించిన సేవలలో ఎలాంటి అవాంతరాలు, లోపాల వల్ల జరిగే నష్టాలకు పరిష్కారం పొందవచ్చన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్, శాశ్వత లోక్ అదాలత్‌కు గల వ్యత్యాసాన్ని వివరించారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారం కాని సమస్యలను శాశ్వత లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా కోర్టులోని శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డప్ప, అధ్యాపకులు సుబ్బనరసయ్య, శాశ్వత లోక్‌అదాలత్ సభ్యులు ఎం.వి.సుబ్బారెడ్డి, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యాన కళాశాల పురోగతిపై సమీక్ష



పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డితో చర్చిస్తున్న వైస్ చాన్సలర్ జానకీరామ్

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఏపీ కార్ల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఉద్యాన కళాశాలకు సంబంధించిన పనుల పురోగతిపై వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జానకీరామ్ పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల హాస్టల్ భవనాలకు సంబంధించి చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కళాశాలకు కేటాయించిన విద్యార్థులు అక్టోబర్ మొదటి వారంలో రావచ్చన్నారు. టిష్యు కల్చర్ అరటి మొక్కల ఉత్పత్తిని అరటి పరిశోధన స్థానంలో చేపట్టడానికి అవసరమైన నిధుల విషయంపై పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డికి ప్రతిపాదనలు ఇచ్చారు. పులివెందుల ప్రాంతంలోని నల్లపురెడ్డిపల్లె రోడ్డు సమీపంలో ఉన్న అరటి ప్రాసెసింగ్ క్లస్టర్ యూనిట్‌ను, ముద్దనూరు రోడ్డులోని మార్కెట్‌యార్డులో ఉన్న చీనీ, నిమ్మ వేలం ప్రక్రియను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, ఏపీకార్ల్ సీఈఓ రమణారెడ్డి, బోర్డు మెంబర్ ప్రసాద్‌రెడ్డి, అరటి పరిశోధన శాస్త్రవేత్తలు సుశీల, దత్తారెడ్డి, రేష్మా, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్ మృతి

కడప, కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం కోర్టు సర్కిల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందినట్లు కడప వన్ టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చెన్నూరు మండలానికి చెందిన పద్మనాభం (54) ఆర్టీసీ కడప డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లేందుకు ఇంటి నుంచి కడపకు ద్విచక్రవాహంలో వెళ్తుండగా కోర్టు సర్కిల్ వద్ద కింద పడటంతో తలకు తీవ్రమైన గాయమైంది. రిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేర్పించగా, శనివారం మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈఆర్ మూర్తి, కేకే కుమార్, రాము తదితరులు సందర్శించి నివాళులర్పించారు.